విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు: సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: పోలీస్ స్టేషన్‌లో ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించిన సిపి స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, ఆయా ఖాళీ ప్రాంతాలను శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల మొత్తం పరిశీలించిన సిపి స్టేషన్ నందు సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. స్టేషన్‌తో పాటుగా మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండస్ట్రియల్ ఏరియా ఎక్కువగా ఉన్న స్టేషన్ పరిధిలో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా క్రైమ్ పోలీసులు పోలీసింగ్ చేయాలన్నారు. విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సదస్సు గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం: దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్కాపురం గ్రామ మండలిలో రాష్ట్ర సదస్సు గోడ పత్రికను దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జేవి ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యతిరేకంగానే పాలన సాగిస్తుందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలన్నిటిని నిర్వీర్యం చేసిందన్నారు. కరుడుగట్టిన వివక్షతతో షెడ్యూల్డ్ తెగకు చెందిన మహిళ అయిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించకుండా అవమానించారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న దళితులందరూ కూడా ఆగస్టు 13వ తేదీన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజు, గుడాల రాంబాబు, మండే సత్యనారాయణ, గుడాల ఈశ్వరరావు, కె.కామేశ్వరరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం కార్యాలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ నిరంతరం పనిచేస్తూ ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు, అధికారులకు, కాంట్రాక్ట్ కార్మికులకు నేటికీ జీతాలు చెల్లించక పోవడం యాజమాన్యం అసమర్థతకు నిదర్శనం అని అన్నారు. పన్నులు, జీఎస్టీలు, కరెంటు బిల్లులు వంటివి సకాలంలో చెల్లిస్తున్న యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, దాసరి శ్రీనివాస్, సిహెచ్ సన్యాసిరావు, అప్పారావు, శ్రీనివాసరాజు, పుల్లారావు, మరిడయ్య, సంతోష్ రాజు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో ఫ్రీడం క్విజ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెగా ఫ్రీడమ్ క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. డా. బి.ఆర్.అంబేద్కర్ విజన్ అన్ని తరాలకు అందించటం, మన దేశ స్వాతంత్ర్యం సాధించడంలో మహోన్నత వ్యక్తులు చేసిన కృషి, వారు చేసిన శౌర్యకార్యాలను, నేటి తరం అర్థం చేసుకోవడంలో సహాయపడడం, ఈ పోటీ ద్వారా, విద్యార్థుల్లో జ్ఞానాన్ని దేశభక్తిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఈవెంట్‌లో అన్ని విద్యాసంస్థలు పాల్గొనవలసిందిగా కోరారు. ఏ తరగతి చదువుతున్న విద్యార్థులు అయినా పాల్గొనవచ్చునని, రౌండ్ 1లో ఆన్‌లైన్ క్విజ్ ఆగస్టు 12న ఉంటుందన్నారు. సాయంత్రం 7:00 గంటలకు క్విజ్ లింక్ అందించబడుతుందన్నారు. రౌండ్ 2లో వ్రాత పరీక్ష ఆగస్టు 13న, రౌండ్ 3 గ్రాండ్ ఫినాలే, బహుమతి పంపిణీ ఆగస్టు 14న ఏయూలోని సైన్స్ అండ్ టెక్నాలజీ భవనంలోని డా. అంబేద్కర్ చైర్ కార్యాలయంలో జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఎవరైనా ఐదుగురు ఒక గ్రూపుగా పాల్గొనవచ్చు అన్నారు. ఆసక్తి గలవారు ఆగస్టు 11వ తేదీ నుంచి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని, ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, వివరాలకు 9182381947, 9700066832ను సంప్రదించాలని కోరారు.

ఆహ్లాదకరంగా భీమిలి పోలీస్ స్టేషన్
సీపీ ఆదేశాలతో వాహనాల తరలింపు

విశాలాంధ్ర - భీమిలి: నగరంలోని పలు నేరాలలో దొరికిన వాహనాలను స్టేషన్ ఆవరణలో ఉంచకుండా తరలించాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో భీమిలి పోలీస్ స్టేషన్లో వివిధ నేరాలలో పట్టుబడిన వాహనాలను సీఐ డి.రమేష్, తన సిబ్బందితో కలిసి వేరే చోటకు తరలించి శుభ్రం చేయించారు. దీంతో స్టేషన్ పరిసర ప్రాంతాలు క్లీన్ అండ్ గ్రీన్‌గా మారాయి. గతంలో స్టేషన్ చుట్టూ వాహనాలు ఎక్కువగా ఉండటంతో సమస్యపై వచ్చిన ఫిర్యాదుదారులు స్టేషన్ ఆవరణలో ఉండేందుకు ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో వాహనాలను వేరే చోటకు తరలించడం వల్ల పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారడంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

- విశాఖను గత పాలకులు నిర్లక్ష్యం చేశారు
- మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ అభివృద్ధికి కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎంవీపీలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. విశాఖను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, ఎక్కడా ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 12 ఫ్లై ఓవర్లు ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ రోడ్డుకి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు చేసిన భూ అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఉనికిని కోల్పోయిన వైసీపీ సభ్యులు నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలే భవిష్యత్ కూటమి గెలుపునకు పునాది అని చెప్పారు. టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ అవుతుందని జోష్యం పలికారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం సంతాపం

విశాలాంధ్ర - పెందుర్తి: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఎం పెందుర్తి జోన్ కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు కార్మిక నగర్‌లో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్, జోన్ కార్యదర్శి రమణి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రముఖ సిపిఎం నాయకుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మరణ వార్త బాధించిందన్నారు. ఐదు దశాబ్దా లకు పైగా అతని సాధారణ జీవితం, ప్రజా సేవ పట్ల అంకితభావం మెచ్చదగినవని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆధునిక చరిత్రను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడంలో కీలకపాత్ర పోషించారు పేదలకు భూమి పంచడంలో కీలకపాత్ర పోషించారన్నారు. 11 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసే సాధారణ జీవితం అనుభవించిన బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పించడం అంటే పేదలందరికీ ఇళ్ళు సాధించేవరకు పోరాటం చేయటమేనని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి, మద్దతుదారులకు తన ప్రగాఢ సానుభూతిని సభ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు కే.అప్పలనాయుడు, మౌలాలి, ప్రభుదేవా, ఈశ్వర్‌రావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు కేంద్రం గుర్తింపు

దేశంలో తొలిసారి జీవన్‌ధాన్ అవార్డు అందుకున్న ఏపీ
ఢిల్లీలో అవార్డు స్వీకరించిన రాష్ట్ర కో-ఆర్డినేటర్ కె.రాంబాబు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పేద ప్రజలకు జీవన్‌ధాన్ పథకంపై అవగాహన, అవయవ దానాన్ని ప్రోత్సహిస్తున్న ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలోనే జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ ప్రభు త్వానికి లభించిన జీవన్‌ధాన్ అవార్డును రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు స్వీకరించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా అవయవాలను దానం చేయడంతో పాటు, ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సేవలను గుర్తించి దేశ వ్యాప్తంగా అందించే ఈ అవార్డు తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కింది. ఈ అవార్డును కేంద్ర, ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్, నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వినోద్ కె.పాల్, ఆరోగ్యశాఖ సెక్రటరీ ఎస్. హెచ్.అపూర్వ చంద్ర, డాక్టర్ అతుల్ గోయల్ చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ కె.రాంబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో విద్యార్థి దశ నుంచి ప్రత్యేకంగా అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కృషి చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశాలను పాటిస్తూ ఈ

దేశ ఆర్థిక అభివృద్ధిలో మత్స్యకారుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - విశాఖపట్నం: దేశ ఆర్థిక అభివృద్ధిలో మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమల పాత్ర ఎంతో ప్రధానమని ఏయూ విద్యావిభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు అన్నారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వ ఫిషరీస్, యానిమల్ హస్బండ్రీ, డైరీ శాఖ ఆధ్వర్యంలో పోర్ట్ బ్లేర్‌లోని జోనల్ కార్యాలయంలో మత్స్యకారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ భారతదేశానికి తీర ప్రాంతం అతిపెద్ద ఆర్థిక వనరుగా నిలుస్తోందని చెప్పారు. ఇది ప్రత్యక్షంగా మత్స్యకారులకు ఉపాధిని కల్పించడంతోపాటు, పరోక్షంగా అనుబంధ పరిశ్రమలకు స్థానం కల్పిస్తోందని చెప్పారు. వేలాది అనుబంధ పరిశ్రమలు సముద్ర తీరాన్ని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో మంచి పోషక ఆహారంగా మత్స్య ఉత్పత్తులు నిలుస్తాయని చెప్పారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఈ రంగాన్ని పటిష్టం చేయడం ఎంతో అవసరం అన్నారు. దీనికోసం చేపట్టాల్సిన చర్యలను, దీనిలో మత్స్యకారుల భాగస్వామ్యాన్ని ఆయన సోదాహరణంగా వివరించారు. సముద్రాన్ని ఆధారంగా చేసుకుని జీవిస్తున్న మత్స్యకారులు తమ ఉత్పత్తులకు విలువను జోడించే విధంగా ఆలోచన చేయాలని ఈ దిశగా అవసరమైన సహాయాన్ని కేంద్ర మత్స్య శాఖ అందిస్తుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నిపుణుల సూచనలను ఎప్పటికప్పుడు వినియోగించుకుంటూ వేట సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆచార్య టి.షారోన్ రాజును నిర్వాహకులు సత్కరించారు. పాండిచ్చేరి యూనివర్సిటీతోపాటు పోర్టు బ్లేర్‌లో ఆయన మత్స్యకారులను, విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కల్పించారు. మత్స్యకారులకు జీవిత బీమా భద్రత కల్పించడం, రాయితీపై రుణాలు అందించడం, మత్స్యకార చిన్నారులకు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించడం అవసరమని చెప్పారు. తీరానికి దగ్గరలో మత్స్యకారులకు నివాస గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆచార్య షారోన్ రాజు సూచించారు. తద్వారా వారి సామాజిక, ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు.

కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని అఖిల భారత లాయర్ల యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కోర్టు వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వి.రామాంజనేయరావు మాట్లాడుతూ కొత్త చట్టాలు పౌర హక్కులు హరించే విధంగా వున్నాయని విమర్శించారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఇవి బ్రిటిష్ కాలం చట్టాలు అని వాటి స్థానంలో కొత్త చట్టాలు అమలు చేస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పడం సరికాదన్నారు. పార్లమెంటులో గత ఏడాది డిసెంబర్‌లో చర్చ లేకుండా, ప్రతిపక్షాలను బహిష్కరించి ఆమోదించారన్నారు. కొత్త చట్టాలు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులను గందరగోళానికి గురి చేస్తున్నాయన్నారు. ఈ చట్టాల వలన ఎవరైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే 14 రోజుల్లో పెండింగ్ తరువాత ఎఫ్ఐఆర్ నమోదు కోసం రాజకీయ ఒత్తిడి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన మూడు చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కొత్త సీసాలో పాత సారా చందంగా తయారైందని విమర్శించారు. సంకెళ్లు వేసి నేరస్తులను కోర్టుకి తీసుకు వెళ్ళే అధికారం పోలీసులకు ఇవ్వడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు జి.నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పూర్ణిమ, ఆనంద రెడ్డి, పి.మణి, కోశాధికారి అప్పల రెడ్డి పాల్గొన్నారు.

గణాత్మక రసాయనశాస్త్రంపై గీతం కోర్సు

విశాలాంధ్ర - మధురవాడ: రసాయన శాస్త్రంలో అణువులు, పదార్థ నిర్మాణం వాటి గుణాలను కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఉపయో గించి ఖచ్చితంగా లెక్కించడానికి ఉపయోగపడే గణాత్మక రసాయనశాస్త్రం నైపుణ్యాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సును ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. రసాయన శాస్త్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యంగా క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో పదార్థ విజ్ఞానం, రసాయన సంకలనాలను అర్థం చేసుకోవడంలో కం ప్యుటేషనల్ టెక్నిక్‌లు పరిశోధకులకు ఉపయోగపడ తున్నా యన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ క్వాంటమ్ కెమిస్ట్రీకి ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో గణాత్మక రసాయన శాస్త్రంలో విద్యార్థులు అవ గాహన పెంచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో కంప్యుటేషనల్ టెక్నిక్ అవసారాన్ని గుర్తించి కెమ్‌డ్రా, గుసైన్, ఫోర్ట్రాన్ వంటి అంశాల ఆధారంగా సర్టిఫికేట్ కోర్సును రూపొం దించామన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్‌లు డాక్టర్ అనిక్ సేన్, డాక్టర్ రాహుల్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జాతర పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఆగస్టు 22వ తేదీన రైటర్స్ అకాడమీ సారథ్యంలో భారీ ఎత్తున జరగనున్న ఉత్తరాంధ్ర జాతర పోస్టర్‌ను రాష్ట్ర సాంస్కృతిక టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. సచివా లయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కూడా పాల్గొన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సభ్యులు విక్రమ్ కుమార్, ధనుంజయ సచివాలయంలో మంత్రి దుర్గేష్‌ను తన ఛాంబర్‌లో కలిసి కార్యక్రమం గురించి వివరించారు. ఉత్తరాంధ్రలో ఉన్న దాదాపు 50 జానపద కళారీతుల్ని ఆగస్టు 22వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్నట్లు మంత్రికి తెలియ జేశారు. అంతకుముందు బీచ్ రోడ్డులో మధ్యాహ్నం 3 గంటల నుంచి సుమారు రెండు వేల మంది జానపద కళాకారులు ఊరేగింపు నిర్వహిస్తూ తమతమ కళారూపాలు ప్రదర్శిస్తారని చెప్పారు. ఇందులో గిరిజన సాంప్రదాయ నృత్యం థింసా, తప్పెట గుళ్ళు, డప్పు నృత్యం, పులి వేషాలు, కోలాటం, గర గలు, జముకులు, యక్షగానం, చిందు భాగోతం, గొల్ల సుద్దులు, గురువయ్యలు, చిరుతల రామాయణం, చెక్క భజన వంటి తెలుగు జానపద కళారీతులు ఉంటాయని వీరు మంత్రికి వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక అతిథిగా ప్రముఖ నటులు పద్మశ్రీ బ్రహ్మానందం విచ్చేస్తున్నట్లు మంత్రికి తెలియజేశారు. ఉత్తరాంధ్రలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ జానపద కళల ప్రదర్శన జరుగుతున్నందున ముఖ్యఅతిథిగా రావాలని కందుల దుర్గేష్‌కు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం పట్ల ఆసక్తిని కనబరిచిన మంత్రి ఉత్తరాంధ్రేతర కళారూపాలను కూడా ఆరోజు విశాఖ పంపడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.

పులి లక్ష్మిబాయికి సీపీఐ సత్కారం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి ఇటీవల స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా ఎన్నికైన సందర్భంగా గురువారం సీపీఐ నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, పెదపూడి దుర్గారావు, వై.దేముళ్ళు, కె.రమేష్‌లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెదగంట్యాడ సీపీఐ కార్యదర్శి యేల్లేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో గల గ్రామాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ ప్రాంతంలో వృద్ధులకు రకరకాల కారణాలతో గత ప్రభుత్వం పెన్షన్లు రద్దు చేసిందని, అర్హులైన పేదలను గుర్తించి న్యాయం చేయాలని లక్ష్మిబాయికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, టీడీపీ నాయకులు పులి వెంకట రమణ రెడ్డి, ములకలపల్లి పెంటయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ దగ్గర ఇటీవల జరిగిన ఇంజనీరింగ్ విద్యార్థుల మరణాలను దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వృక్ష ఫౌండేషన్ ఫౌండర్ కాకర సురేష్ కుమార్, మేము సైతం సేవా సొసైటీ ఫౌండర్ అక్కిరెడ్డి దేవుడు బాబు, వృక్ష ఫౌండేషన్ ప్రతినిధులు కే.కిరణ్, సిహెచ్ నాయుడు, ఉప్పాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బోని గ్రామంలో పొలంబడి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బోని గ్రామంలో ఉత్తమ పంటల యాజమాన్య పద్ధతులపై పొలంబడి గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారిణి సి. హెచ్.సంధ్య రత్న ప్రభ రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు ద్వారా పండించే వరి పంటకు ఉన్న మార్కెటింగ్ సదుపాయాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వి.ఏ.ఏ. దిలీప్, రైతులు పాల్గొన్నారు.

కృష్ణంరాజుపేటలో
పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - తగరపువలస: కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన 24 మంది సభ్యులలో ఒకరిని చైర్ పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఆరుగురిని ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా మరొక ఇద్దరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరందరి చేత ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహక రించాలని అన్నారు. అనంతరం జన గణమనతో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.

జీవీఎంసీ ఏడీసీగా రమణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ ఏడీసీగా రమణమూర్తి నియమితులయ్యారు. రమణమూర్తి గతంలో విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించే వారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ జేడీగా కాకినాడ బదిలీపై వెళ్లారు. మళ్లీ తాజాగా ఇటీవల జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమితులై విశాఖ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా డి.వి.రమణమూర్తి నియమితులైన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను తన ఛాంబర్లో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఐపిఆర్‌లో పీజీ డిప్లమో కోర్సు ప్రారంభం



విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్-ఐపిఆర్‌లో పీజీ డిప్లమా కోర్సును ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రారంభించింది. ఏడాది కాల వ్యవధితో నిర్వహించే ఈ కోర్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబులు వర్చువల్ విధానంలో ఈ కోర్సును ప్రారంభించారు. ఈ కోర్సుకు ఇప్పటికే 54 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం తెలిపారు. ఈ కోర్సులో 13 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, 4గురు విదేశీ విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు. వీరిలో అధికశాతం మంది వైద్యులు, న్యాయవాదులు, పరిశోధకులు, ఉన్నత విద్య వంతులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో నోవెల్ పేటెంట్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్ పి.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర - భీమిలి: వాహనాలలో అధిక లోడుతో తరలించడం నిబంధనలకు వ్యతిరేకమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజారావు, శిరీషాదేవిలు అన్నారు. రోడ్డు రవాణా శాఖ ఉప కమిషనర్ జె.రాజారత్నం ఆదేశాలతో అధిక లోడు వాహనాలను తనిఖీ చేశారు. గురువారం భీమిలి పరిసర ప్రాంతాల్లో అధిక లోడుతో వెళ్తున్న లారీలు, ట్రాక్టర్లు, టాటా మ్యాజిక్‌లు తదితర వాహనాలను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో భీమిలి క్రాస్ రోడ్ సమీపంలో 2 వాహనాలపై కేసులు నమోదు చేశారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు అధిక లోడుతో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లారీలు, ట్రక్కులు, ట్రాక్టర్లు బరువులు వేసేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని అన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం మండలం గొల్లలపాలెంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు సక్రమంగా జరిగాయి. ఈ ఎన్నికలలో ప్రతి తరగతి నుండి ముగ్గురు చొప్పున సభ్యులు నియమించబడ్డారు. వారిలో ఒకరు చైర్మన్‌గా చందవరపు కుమార్, వైస్ చైర్మన్‌గా ఇంటి రవణమ్మ గెలు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కలిషా బేగం మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలలో గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేసి పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి మనందరం ఐకమత్యంగా కృషి చేయాలని చెప్పారు. గెలుపొందిన వారు తమ వంతు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఎన్నికల నిర్వహణలో విద్యాలయం సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పువ్వుల మార్కెట్‌కు శ్రావణ శోభ

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా పువ్వుల మార్కెట్లు అన్నీ కూడా గురువారం ఉదయం నుండి రద్దీగా కళకళలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ప్రతి ఏడాది భక్తులు వారికి కావలసిన పువ్వులను కొనుగోలు చేస్తారు. మల్లె కిలో 800 నుంచి 1000 రూపాయలు వరకు, విరజాజులు 400 నుంచి 600 వరకు, చామంతి 300 నుంచి 500 వరకు, గులాబీ 500 రేట్లు ఉన్నాయని భక్తులు తెలిపారు. గురువారం వ్యాపారస్తులతో మాట్లాడగా మొదటి వారం అమ్మకాలు పడిపోయాయని, చాలా వరకు పువ్వులు అలాగే ఉండడం వల్ల ఈ వారం అమ్మకాలు సరిగా జరగలేదని తెలిపారు. ఏదేమైనా సరే మొదటివారం కావున నెమ్మదిగా మొదలై రెండవ వారం నుంచి జోరు అందుకుంటాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - తగరపువలస: 33/11కేవి చిట్టివలస సబ్ స్టేషన్‌లో 11కేవీ చిట్టివలస ఫీడర్‌పై మెయింటెనెన్స్ వర్క్స్, చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. కొండపేట, పంప్ హౌస్ లైన్, జ్యూట్ మిల్ కోర్టర్స్, సంతపేట, గణేష్ తీయటర్ రోడ్, ఫుట్ బాల్ గ్రౌండ్ ఏరియా, సప్తగిరి లేఔట్ ఏరియా గల ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఉచిత న్యాయ సలహాలపై అవగాహన

విశాలాంధ్ర - తగరపువలస: తాటితూరు గ్రామ సచివాలయంలో ఉచిత న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా డిఎల్ఎస్ఎ జడ్జి అధ్యక్షతన ఎమ్మార్వో, ఎంపీడీఓ, భీమిలి సిఐ, ఎస్ఐలు పాల్గొని ఉచిత న్యాయ సహాయం పొందడం గురించి వివరించారు. వాహనదారులు హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్ నివారణపై ప్రజలకు సూచనలు ఇచ్చారు.

తాటితూరులో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - తగరపువలస: తాటితూరు గ్రామంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున చైర్మన్‌గా బుడుమూరి సోమేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా మేడ పద్మావతి ఇంకా కూటమి తరుపున 21 మెంబర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు కృషి చేసినటువంటి కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, గ్రామ పెద్దలకు, గ్రామ ప్రజలకు కూటమి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉత్పత్తికి సరిపోయే ముడిసరుకు అందించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్ ప్లాంట్ కు సరిపడా ముడి సరుకు అందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో కన్వీనర్ అయోధ్య రామ్ డిమాండ్ చేశారు. కూర్మన పాలెం లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరం గురువారం నాటికి 1274 రోజులకు చేరుకుంది. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సుమారు 54,000 కోట్ల రూపాయల స్టీల్ ప్లాంట్ కార్మికులు పన్ను రూపంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షించడానికి కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతుంటే కనీసం కేంద్ర ప్రభుత్వం చలించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ పోరాటాన్ని ఎంత ఉధృతం చేశానా సరే విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని అన్నారు. సిఐటియు యూనియన్ కి చెందిన పలువురు ఉద్యోగులు దీక్షశిపురం లో పాల్గొని నిరసనలు తెలియజేశారు.

61 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 61 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. దీనిలో భాగంగా 59 పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలు పూర్తి జరిగినట్లు ఎంఈఓ 2 బాబు లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతవరం, కే కొవ్వాడ గ్రామాల్లో ఎన్నికలు జరగలేదని తెలిపారు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్యన అయినాడ గ్రామంలో స్కూలు చైర్మన్ ఎలక్షన్లు జరిగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్యన జరిగిన విభేదాల కారణంగా అయినాడ స్కూల్ చైర్మన్ ఎలక్షన్ ఆలస్యంగా జరిగినది. చివరికి పత్రికలు మరియు మీడియా వారు సహకారంతో ఎన్నికలను సజావుగా నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి పరాభవం తప్పదు

- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాభవం తప్పదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. గురువారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ వైసిపి అరాచకాలే ఆ పార్టీని పాతాళానికి తొక్కాయన్నారు. వంశీకృష్ణకు మేయర్ స్థానం ఇస్తానని చెప్పి మోసం చేశారని, జీవీఎంసీ కౌన్సిల్ ఎన్నికలలో వైసిపి ఓటమిలో వంశీకృష్ణ కీలక పాత్ర ఉందన్నారు. పరాభవం చెందకముందే బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీ పోటీ నుంచి తప్పుకోవాలన్నారు.

మండల స్థాయి అధికారులను కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - పద్మనాభం: మండల స్థాయి అధికారులను జనసేన నాయకులు కలిశారు. తాసిల్దార్ ఆనంద్ కుమార్, ఎలక్ట్రికల్ సబ్ ఇంజనీర్ రమేష్‌లను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు జనసేన పార్టీ పద్మనాభం మండల అధ్యక్షులు కురిమిన రామ స్వామి నాయుడు, విశాఖ జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ విబి నాయుడు, ముద్దాడ సూరప్పడు, ప్రధాన కార్యదర్శి మజ్జి రమేష్, మజ్జి సురేష్, నాయుడు, సోమేష్, మని, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారం నియంత్రించేందుకు అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆసియా సెక్యూరిటీ, యాంటీ కౌంటర్‌ఫీటింగ్, ట్రేడ్‌మార్క్ అండ్ బ్రాండ్ ప్రొటెక్షన్ పేరిట ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ హెడ్ - ఇల్లీసిట్ ట్రేడ్ ప్రివెన్షన్, రోడ్నీ వాన్ డోరెన్ మాట్లాడుతూ, ఈ ముప్పును అరికట్టేందుకు, కఠినమైన నియంత్రణ, చట్టాలను జారీ చేయడంతో పాటు అక్రమ వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం ఎలా మూలస్తంభంగా ఉంటుందో తెలిపారు. నిషేధం ఆచరణీయమైన ఎంపిక ఎలా కాదనే అంశంతో పాటు, అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు నియంత్రణ మరియు అమలు పరిష్కారాలను సోదాహరణంగా వివరించారు. ఢిల్లీలో జులై 23, 24 తేదీల్లో జరిగిన రెండు రోజుల సదస్సు 'అక్రమ వ్యాపారం మరియు నకిలీలకు వ్యతిరేకంగా పోరాటంలో సహకారం మరియు ఐక్యత శక్తి' అనే అంశంపై దృష్టి సారించింది.

సంస్కృత భాష దేశ సంపద

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సంస్కృత భాష భారతదేశ సంపద అని ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ అన్నారు. గురువారం సంస్కృత భారతి ఆధ్వర్యంలో ఏఎస్ రాజా జూనియర్ కళాశాలలో సంస్కృత భాష పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్కృతం భారతీయ భాషకు మూలం అన్నారు. పురాణం ఇతిహాస గ్రంధాలన్నీ సంస్కృతంలోనే వ్రాయబడ్డాయని తెలిపారు. విద్యార్థులు సంస్కృతాన్ని నేర్చుకోవటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్కృతాన్ని నేర్చుకునే విద్యార్థులకు ప్రోత్సహించడం కోసం బాబా బజార్ స్కాలర్‌షిప్పులను ప్రకటించడాన్ని గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో సంస్కృత లెక్చరర్ గౌరీ నాయుడు, సంస్కృత భారతి వాలంటీర్లు బి.వి.ఎల్.ఎన్. స్వామి, కె. సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణ కేంద్రాల భద్రతా చర్యలపై కలెక్టర్‌కు సీపీ లేఖ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ కమిషనరేట్ పరిధిలో గల నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు, ప్రసూతి కేంద్రాల వద్ద ముందస్తు భద్రతా చర్యలపై జిల్లా కలెక్టరుకు నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చి లేఖ రాశారు. గడిచిన కొంతకాలంలో కొన్ని చోట్ల నవజాత శిశువుల కిడ్నాప్, నవజాత శిశువుల మార్పిడులు జరిగిన నేపథ్యంలో వాటిని పూర్తిగా నిరోధించడానికి, విశాఖపట్నం జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెలివరీ, నవజాత శిశువులు సంరక్షణా సదుపాయం ఉన్న ప్రసూతి గృహాల వద్ద శిశువుల కిడ్నాప్‌లు, మార్పిడులు నిరోధించడానికి కావలసిన భద్రతా చర్యలపై కలెక్టర్‌కు లేఖ రాశారు. నగరంలో ఈ విభాగములో ప్రయివేటు ఆసుపత్రులు 68, ప్రభుత్వ ఆసుపత్రులు 12 కలిపి మొత్తముగా 80 ఉన్న ఈ కేంద్రాల యందు కొన్నింటిలో పైన తెలిపిన భద్రతా సౌకర్యాలు లేవని గుర్తించిన సిపి ఈ మేరకు జిల్లా కలెక్టరుకు సదరు విషయం నివేదించి, భద్రతా చర్యలపై లోపాలను గుర్తించి ఆ లోపాలను సరిదిద్దడానికి సూచించవలసిందిగా సీపీ సదరు లేఖ ద్వారా నగర కలెక్టర్‌ను అభ్యర్థించారు.

డైట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ సంస్కరణ కార్యక్రమం

విశాలాంధ్ర - భీమిలి: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి నేటి యువతలో ఇంకనూ కొనసాగాలని డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థలు గురువారం క్విట్ ఇండియా ఉద్యమ సంస్మరణ కార్యక్రమం వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇంకా కొన్ని అవాంఛనీయ అవలక్షణాలు దేశంలో అమలు జరుగుతున్నాయని, అవినీతి, అశుభ్రత, అసమానత, మాదక ద్రవ్యాలు మొదలగునవి విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిని దేశం నుండి పారద్రోలడానికి అందరూ కంకణం కట్టుకోవాలని ఆమె ఉద్బోధించారు. క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర ఉద్యమాన్ని మరో మలుపు తిప్పిందని, 1942 ఆగస్టు 8న గాంధీజీ చేసిన ప్రసంగంలో మరణమో లేక స్వతంత్రమో అని ఆయన గర్జించిన సందర్భాన్ని సీనియర్ ఆధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు గుర్తు చేశారు. ఆనాడు స్వాతంత్రోద్యమంలో జాతీయ కాంగ్రెస్ సారధ్యంలో జరిగిన ఉద్యమాన్ని నాయకుల త్యాగాన్ని ఆయన వివరించారు. డైట్ నుండి భీమునిపట్నం వీధులలో క్విట్ ఇండియా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిఏ సోమయాజులు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, పి.హరిణి, జి.రవి తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా పాఠశాల చైర్మన్ల ఎన్నిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో పాఠశాల చైర్మన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అందులో చైర్మన్ ప్రక్రియను కొన్నిచోట్ల ఏకగ్రీవంగా మరికొన్నిచోట్ల ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఎన్నుకోవడం జరిగిందని ఎంఈఓ-2 గంగరాజు తెలిపారు. తర్వాత హైస్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌గా మజ్జి రాంబాబును ఎన్నుకున్నారు. గొట్టిపల్లి ఎంపీయూపీ పాఠశాల పాఠశాల చైర్మన్‌గా తాడివాడ రమణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. లోడగలవానిపాలెం పాఠశాల చైర్మన్‌గా లోడగల పావని, బోయపాలెం హైస్కూల్ పాఠశాల చైర్మన్‌గా చల్లా రామిరెడ్డి ఎన్నుకున్నారని తెలిపారు. ఆనందపురం హైస్కూల్ పాఠశాల చైర్మన్‌గా బి.లక్ష్మి, అలాగే ఉప చైర్మన్‌లను కూడా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మిగతా పాఠశాలలో కూడా ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల నాయకులు నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను, తాడివాడ శివ కృష్ణ, ప్రశాంత్, కూటమి నాయకులు బమ్మిడి ఉమాదేవి, సూర్యనారాయణ, తారక్ వెంకటరావు, కంచి బోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు, మత్తు పదార్థాల నిషేధంలో యువత పాత్రే కీలకం

- చోడవరం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.శేఖరం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం శ్రీ వివేకానంద విద్యా సంస్థల ఆధ్వర్యంలో నడుప బడుతున్న విద్యార్థి డిగ్రీ కళాశాలలో "పొగాకు, మత్తు పదార్థాల నిషేధం" అనే అంశంపై గురువారం విద్యార్థులు, యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చోడవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ డి.శేఖరం పాల్గొని మాట్లాడుతూ యువకులు విద్యార్థులు పొగాకు మరియు మత్తు పదార్థాల వాడకంతో చిన్న వయస్సులోనే జీవితాలు చిత్తు అవుతాయని అన్నారు. మత్తు పదార్థాలు వలన కలిగే నష్టాలు, ప్రమాదాలు గురించి వివరించారు, అంతేకాకుండా మత్తు పదార్థాలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి చేర్చే నేపథ్యంలో అమాయక పేద విద్యార్థులు బలవుతున్నారని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వాడకానికి మరియు వాటిని సరఫరా చేయడానికి దూరంగా ఉండాలని ఎవరైనా మత్తు పదార్థాలు వాడుతున్నట్లు తెలిసినట్లయితే నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి తెలియజేయాలని లేదా 100 నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. పొగాకు మరియు మత్తు పదార్థాల నిషేధంలో యువతి కూడా తమ వంతు పాత్రను పోషించాలని, పోలీసులు, పౌరులు కలిసి కట్టుగా వ్యవహరిస్తే ఈ నిషేధం జరుగుతుందని తెలియజేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చదివినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరో హిస్తారని తెలిపారు. అంతేకాకుండా గంజాయి వంటి మత్తు పదార్థాలను ఉపయోగించినా లేదా సరఫరా చేసిన వారికి విధించే చట్ట ప్రకారం విధించే శిక్షలు గురించి క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్ర మంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పూసర్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలక పాత్ర పోషిస్తుందని ఆ యొక్క కౌమార దశలో విద్యార్థి తప్పుదారి పట్టకుండా చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉంటే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.రామారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, వేచలపు అర్జునరావు, ఏ.ఓ.చీపురుపల్లి దేముడు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా అచ్యుతరావు ఎన్నిక

విశాలాంధ్ర - పిఎం పాలెం: రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలగా ప్రాచుర్యం పొందిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా గురువారం ముగిసాయి. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు సోమయాజుల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహించారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యులను తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు పాఠశాల కమిటీ చైర్మన్ గా జి అచ్యుతరావు, వైస్ చైర్మన్ గా నూకరత్నములను ఎన్నుకున్నారు. డిప్యూటీ డిఈఓ సువర్ణ, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధలు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో ఎలాంటి గొడవలు జరగకుండా పీఎం పాలెం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన పాఠశాల కమిటీ సభ్యులను హెచ్ఎం సోమయాజులు అభినందించారు. ఎన్నికైన సభ్యులలో 12 మంది టీడీపీ సానుభూతివరులు ఉండటంతో స్థానిక టిడిపి నాయకులు చిక్కాల విజయబాబు వారిని అభినందించారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 132/33 కెవి నరసింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల 33 కెవి పురుషోత్తపురం ఫీడెర్ లైన్‌కు సంబంధించి నరసింగబిల్లి నుండి పెద్దపల్లి, యలమంచిలి, పురుషోత్తపురం లైన్‌లో లైన్ మెయింటనెన్స్ (చెట్లు తొలగింపు) నిమిత్తం శుక్రవారం ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అలాగే 33/11 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి పిఎన్ఆర్ పేట ఫీడర్‌కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు (ఆర్.డి.ఎస్.ఎస్) నిమిత్తం మధ్యాహ్నం 1.00 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం, పిఎన్ఆర్ పేట ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, అవకాశం ఉన్న చోట ఉదయం 6:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేవడుతుందని, కావున వినియోగదారులు సహకరించవలసిందిగా విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ కోరారు.

పాత మల్లంపేటలో పొలంబడి

విశాలాంధ్ర - గొలుగొండ: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని సమగ్ర ఎరువులు యాజమాన్యం ద్వారా పెట్టుబడి తగ్గించి నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించాలని ఏడీఏ టి.శ్రీదేవి తెలిపారు. గురువారం మండలంలో పాత మల్లంపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టి.శ్రీదేవి మాట్లాడుతూ అర్హులైన పౌలు రైతులందరూ విలేజ్ రెవెన్యూ అధికారుల ద్వారా కవులు గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు. వరి వంటలు సాగు పద్ధతుల గురించి రైతులకు పూర్తిస్థాయిలో వివరించారు. ప్రతి రైతు తమ పంటల వివరాలను వారి యొక్క రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ, విహెచ్ఎ, ఎఇఓ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చిన జీవీఎంసీ లైఫ్ గార్డులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం కోస్టల్ బ్యాటరీ గోకుల్ పార్కు వద్ద రాళ్ల మధ్య చిక్కుకున్న గుర్తు తెలియని మృతి దేహాన్ని జీవీఎంసీ లైఫ్ గార్డులు అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చారని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్

వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. జీవీఎంసీ పరిధిలో సముద్ర తీర ప్రాంతం వెంబడి ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు జివిఎంసి లైఫ్ గార్డులను ఏర్పాటు చేసిందని, నేడు గోకుల్ పార్కు వద్ద రాళ్ల మధ్యలో ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని జీవీఎంసీ లైఫ్ గార్డులు ధనరాజు, వాసు, కళ్యాణ్, ఎర్నిరాజు ఒడ్డుకి చేర్చి పోలీసులకు అందజేయడం జరిగిందని తెలిపారు. అలాగే జీవీఎంసీ లైఫ్ గార్డులు ఇప్పటివరకు ఆత్మాహత్యకు పాల్పడిన ఎంతోమందిని, ప్రమాదవశాత్తూ బీచ్ లో కొట్టుకుపోతున్న వారిని రక్షించి కాపాడారని తెలుపుతూ ఈ సందర్భంగా లైపు గార్డులను అదనపు కమీషనరు అభినందించారు.